క్లుప్తంగా

యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో యోగా ఇన్‌స్ట్రక్టర్ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి వై.రత్న ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో కోరారు. పీజీ డిప్లమో యోగా లేదా డిప్లమో యోగా అర్హతతోపాటు అనుభవం ఉన్నవారు ఈనెల 23వతేదీలోగా అనిగండ్లపాడులోని ఆయుర్వేద ఆసుపత్రిలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. రెండు పోస్టుల్లో ఒకటి పురుషులు, మరొకటి మహిళలకు కేటాయించినట్లు చెప్పారు. ఎంపికైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశించిన క్యాంపుల ఆధారంగా పారితోషికం చెల్లిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు సెల్‌నంబరు 79818 78013లో సంప్రదించాలని ఆమె సూచించారు.

23న లాటరీ ద్వారా ఎడ్లబండ్ల ఎంపిక

పెనుగంచిప్రోలు: రంగుల మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మవారితోపాటు సహదేవతల విగ్రహాలను రంగుల మండపం వద్ద నుంచి జగ్గయ్యపేట తరలించేందుకు ఎడ్లబండ్లను ఈనెల 23న లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటోతేదీన నిర్వహించే రంగుల మహోత్సవానికి సంబంధించి ఎడ్లబండ్లు కలిగిన యజమానులు ఈనెల 22వతేదీలోగా స్థానిక పోలీసుస్టేషన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. 23వతేదీ ఉదయం 11గంటలకు పోలీసుస్టేషన్‌లో లాటరీ ద్వారా ఎడ్లబండ్లను ఎంపిక చేస్తామని తెలిపారు. 18ఏళ్లు పైబడినవారు మాత్రమే పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. రంగుల అనంతరం ఫిబ్రవరి 18న జగ్గయ్యపేట నుంచి విగ్రహాలతో ఎడ్లబండ్ల తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుందని వివరించారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ



నందిగామ: పట్టణంలోని గాంధీసెంటర్లో కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్రను శనివారం సాయంత్రం నిర్వహించారు. మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాస్ యాత్ర ప్రత్యేకత , కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం పలువురికి ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి డిజిటల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

పశువుల్లో వచ్చే వ్యాధులపై అవగాహన



పోచంపల్లి(జగ్గయ్యపేట): పశుపోషకులు తమ పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేయించాలని పశువైద్యాధికారి విశ్వరాజ్ సూచించారు. గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకంలో భాగంగా శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ యజమానులు పశుపోషణ విషయంలో తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శీతాకాలంలో పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడే ప్రమాదముందని, వెంటనే టీకాలు వేయించాలని సూచించారు. పశువుల్లో వచ్చే వ్యాధులపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విజయ్‌ప్రకాష్, కెవీకె పశువైద్యాధికారి జశ్వంత్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



పెద్దాపురం(వీరులపాడు): పేదలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికి అందాలనే సంకల్పంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురంలో శనివారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ప్రచార రథాన్ని ఆమె ప్రారంభించారు. మహిళలకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, సొసైటీ చైర్మన్ ఆవుల ప్రసాద్, సొసైటీ మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సహకార రంగ అభివృద్ధికి జగనన్న కృషి

ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేటలో సొసైటీ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న విప్ సామినేని ఉదయభాను, తాతినేని పద్మావతి

జగ్గయ్యపేట అర్బన్: వ్యవసాయం, సహకార రంగాలు రెండుకళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక కోదాడ రోడ్డులో ది జగ్గయ్యపేట గోపాలకృష్ణ విశాల సహకార పరపతి సంఘం స్థలంలో సర్దార్ సామినేని విశ్వనాథం పేరుతో రూ.2.45కోట్లతో నిర్మించిన సొసైటీ భవనం, షాపింగ్ కాంప్లెక్స్‌ను కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సొసైటీ ఆవరణలో ది గోపాలకృష్ణ సొసైటీ చైర్‌పర్సన్ కోలపల్లి వెంకటేశ్వరరావు(బుల్లిబాబు) అధ్యక్షతన జరిగిన సభలో విప్ ఉదయభాను మాట్లాడుతూ రైతు, వ్యవసాయం బాగుంటే ఊరు, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. తద్వారా అన్నిరంగాలు సర్వతోముఖాభివృద్ధి చెందుతాయన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన వారసుడైన ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయం, రైతు సంక్షేమానికి వారి పాలనల్లో పెద్దపీట వేశారని కొనియాడారు. 1958లో ప్రారంభమైన గోపాలకృష్ణ సొసైటీ చైర్మన్‌గా తనతండ్రి సామినేని విశ్వనాథం 32ఏళ్లు, తాను రెండు పర్యాయాలు పనిచేసి సొసైటీ అభివృద్ధికి కృషిచేమన్నారు. 18ఏళ్లుగా బుల్లిబాబు చైర్మన్‌గా ఉంటూ సొసైటీని లాభాల బాటలో పయనించేలా పనిచేస్తున్నారని అభినందించారు. నాడు రూ.80లక్షలుగా ఉన్నసొసైటీ టోర్నవర్ నేడు రూ.4.50కోట్లకు పెరిగిందని చెప్పారు. సొసైటీ భవనం, షాపింగ్ కాంప్లెక్స్‌ను నాబార్డు నిధులు రూ 1.30కోట్లు, సొసైటీ స్వంత నిధులు రూ.1.15 కోట్లు కలిపి మొత్తం రూ 2.45కోట్లతో నిర్మించడం అభినందనీయమన్నారు. సొసైటీ భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ నాయకులు ఎన్ని అవాంతరాలు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదని, పేట అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని చెప్పారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన టీడీపీ నాయకుల నిజస్వరూపాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హైవే వద్ద చేపట్టిన 150 అడుగుల జాతీయజెండా స్తూపం, హైవే బస్టాండ్, టీటీడీ కల్యాణ మండపాలను ఫిబ్రవరి నెలలో ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా భావించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో రైతు సంక్షేమానికి ఎనలేని కృషిచేస్తున్నారని కొనియాడారు. తనతండ్రి ఆశయాల సాధన కోసం ఎమ్మెల్యే ఉదయభాను చేస్తున్న అభివృద్ధి మరువలేనిదన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలన్నారు. ఎమ్మెల్యేగా ఉదయభాను, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్, శ్రీనివాసగౌడ్, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, సచివాలయాల పట్టణ కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవి శంకర్, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, పందుల రోశయ్య, వట్టెం మనోహర్, గోపాలకృష్ణ సొసైటీ వైస్‌చైర్‌పర్సన్లు గెంటేల భాగ్యలక్ష్మి, షేక్ బాజానీ, సీఈవో ఎం.శ్రీనివాసరావు, ఆయా సొసైటీల అధ్యక్షులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



అనుమంచిపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ ఉదయభాను, తాతినేని పద్మావతి

అనుమంచిపల్లిలో గోడౌన్ ప్రారంభోత్సవం.

ది గోపాలకృష్ణ సొసైటీ పరిధిలోని అనుమంచిపల్లిలో రూ.40లక్షలతో నిర్మించిన ఎంపీఎఫ్‌సీ గోడౌన్‌ను ఎమ్మెల్యే ఉదయభాను, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ప్రారంభించారు. గ్రామ సర్పంచి పానుగంటి లక్ష్మీత్రివేణి నాయుడు, మాజీ సర్పంచ్ బెడదం సత్యం, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కుందవరపు సుబ్బారావు, పి. ఉదయభాను, రైతుభరోసా చైర్మన్ పి.రవి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జగనన్నకు మెండుగా ప్రజల ఆశీస్సులు

ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



గండేపల్లిలో మహిళ సమస్య వింటున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు



ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావును సత్కరిస్తున్న గ్రామస్తుడు

గండేపల్లి(కంచికచర్ల) : రాష్ట్రప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లిలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలుకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన ఇద్దరు కుమారుల్లో ఒకరికి జగనన్న ప్రభుత్వం ఉచితంగా స్థలాన్ని కేటాయించడంతోపాటు ఇంటిని కూడా మంజూరు చేసిందని, మరో కుమారుడికి కూడా స్థలం ఇచ్చి ఆదుకోవాలని గ్రామానికి చెందిన సంగం అలఫన్స్ అనే మహిళ ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు విజ్ఞప్తి చేయగా ఆయన వెంటనే స్పందించి సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో ఎన్నిస్థలాలు ఖాళీగా ఉన్నాయని అడిగి, ఖాళీగా ఉన్న ఓ స్థలాన్ని అలఫన్స్ కుమారుడికి కేటాయించాలని ఆదేశించారు. దీంతో గ్రామస్తురాలు అలఫన్స్ స్పందిస్తూ ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగనన్న ఈ నాలుగున్నరేళ్ల పాలనలో పార్టీలకతీతంగా ప్రతి ఇంటికి రూ.లక్ష నుంచి రూ.8లక్షల వరకు లబ్ధి చేకూరిందని వివరించారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ఇంటి ముంగిటికే తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో లేనివిధంగా అమ్మఒడి, ఆసరా, చేయూత, చేదోడు, రైతుభరోసా, విద్యాకానుక, వసతిదీవెన వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. 66.34లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం దేశంలోనే మరొకటి లేదని సీఎం జగనన్న సుపరిపాలనకు ఇదే నిదర్శనమని కొనియాడారు. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్ మోహనరావును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచి బెల్లంకొండ సుబ్బారావు, నాయకులు సంగం దేవరాజ్, కృష్ణా రంగారావు, సుంకు వెంకటబాలాజీ, గడుపూడి సత్యనారాయణ, మట్టా చంద్రశేఖరరెడ్డి, తలమాల కిషోర్, తలమాల రమేష్, పిల్లి మేర్లేన్, వేల్పుల రమేష్, నెలకుదిటి శివనాగమల్లేశ్వరరావు, మార్త శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, వీఆర్వో వెంకటేశ్వరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపీ కేశినేని నానికి ఘనస్వాగతం



పరిటాలలో ఎంపీ నాని, ఎమ్మెల్యే జగన్‌మోహనరావును గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

కంచికచర్ల : టీడీపీని వీడిన తర్వాత మొట్టమొదటి సారిగా నందిగామ ప్రాంతానికి వస్తున్న విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని)కి నందిగామ ప్రాంత ప్రజలు శనివారం ఘన స్వాగతం పలికారు. ముందుగా మండలంలోని పరిటాల వద్ద నేషనల్ హైవే పక్కన కొలువై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం విగ్రహం వద్ద ఎంపీ కేశినేని శ్రీనివాస్, నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని పెండ్యాలలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు విచ్చేసిన ఎంపీకి కార్లు, బైక్‌లతో ర్యాలీగా నాయకులు స్వాగతం పలికారు. పరిటాల హైవేపై ఎంపీ నాని, ఎమ్మెల్యే జగన్‌మోహనరావులకు గజమాల వేసి ఘనంగా సత్కరించారు. జై జగన్, జై నాని, జై జగన్‌మోహనరావు అంటూ నినాదాలు చేశారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వాసిరెడ్డి హనుమంతరావు విగ్రహావిష్కరణ



వాసిరెడ్డి హనుమంతరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

వీరులపాడు: సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన వాసిరెడ్డి హనుమంతరావు ది సిటిజన్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను స్థాపించి అనతికాలంలోనే ప్రగతిపథంలో నడిపించారని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ కొనియాడారు. వీరులపాడు లోని సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వాసిరెడ్డి హనుమంతరావు విగ్రహాన్ని శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరులపాడు గ్రామంలో సామాజ్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన పట్టుదలతో ఉన్నత విద్యనభ్యసించి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. సిటిజన్ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ పిఆర్‌విపిఎస్ రాజు మాట్లాడుతూ సొసైటీ ఆరు రాష్ట్రాల్లో 42 శాఖలు, 300మంది ఉద్యోగులతో కొనసాగుతోందన్నారు. 93వేల మంది ఖాతాదారులతో ఏటా రూ.3,783 కోట్ల టర్నోవర్ సాధిస్తున్నట్లు చెప్పారు. కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా రైతులు, ఆయా వర్గాల వారికి రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సొసైటీ డైరెక్టర్లు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బయ్య, డైరెక్టర్లు మనం ఆంజనేయులు, ప్రసాద్, చలసాని రాఘవేంద్రరావు, గోపాల కృష్ణయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వట్టికొండ చంద్రమోహన్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



టీడీపీ వారికి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ ఉదయభాను

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): రానున్న ఎన్నికల్లో పేటలో మరోసారి వైఎస్సార్ సీపీ ఘనవిజయం సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. అనుమంచిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రాంపొంగు గోపి, పుల్లారావు, మాగి వెంకీ, కంపాటి గోపీలకు చెందిన కుటుంబాలు శనివారం విప్ ఉదయభాను సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉదయభాను వారికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరు పని చేయాలని సూచించారు. నాలుగున్నరేళ్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతిగడపకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ కన్వీనర్‌లు మండవ శ్రీనివాస్ గౌడ్, బాజీ, నాయకులు కుందవరపు సుబ్బారావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



వత్సవాయిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దేవమణి, పక్కన ఎంపీపీ రమాదేవి



క్రికెట్ పోటీల విజేత పెనుగంచిప్రోలు-2జట్టుతో ఎంపీడీవో హర్షసాయి

పెనుగంచిప్రోలు:మండలంలో నిర్వహిస్తున్న ఆడుదాం ..ఆంధ్రా క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. మండలస్థాయి పోటీల్లో పురుషుల విభాగం ఖోఖోలో ముండ్లపాడు, వాలీబాల్‌లో కొణకంచి, బ్యాడ్మింటన్‌లో పెనుగంచిప్రోలు-1, కబడ్డీలో పెనుగంచిప్రోలు-2, క్రికెట్ పోటీల్లో పెనుగంచిప్రోలు-2 జట్లు విజేతలుగా నిలిచాయని ఎంపీడీవో హర్షసాయి తెలిపారు. మహిళల విభాగం బ్యాడ్మింటన్ పోటీల్లో అనిగండ్లపాడు-1, కబడ్డీలో సుబ్బాయిగూడెం జట్లు గెలుపొందాయని వివరించారు. విజేతలను పీడీ వేగినేటి వెంకటరమణ, బాబూప్రసాద్ అభినందించారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి : ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలను జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, ఎంపీపీ కొలుసు రమాదేవి ప్రారంభించారు. ఎంపీడీవో రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ మండలపార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, వైఎస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, భూక్యా రాజానాయక్, కొలుసు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా జగ్గయ్యపేట మండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి.పురుషుల విభాగం క్రికెట్ పోటీల్లో పేటలోని రంగస్వామి బజారు జట్టు, కబడ్డీలో చిల్లకల్లు-1, ఖోఖోలో గండ్రాయి-1, వాలీబాల్‌లో కొలిమిబజారు జట్టు, బ్యాడ్మింటన్‌లో రంగస్వామి బజారు జట్టు, మహిళా విభాం ఖోఖోలో చిల్లకల్లు,బ్యాడ్మింటన్‌లో ముక్త్యాల, కబడ్డీలో చిల్లకల్లు జట్టు విజేతలుగా నిలిచినట్లు ఎంపీడీవో మేకా రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వర రావు తెలిపారు. పీడీలు ఎం.శ్రీనివాసరావు, గంటా వెంకటేశ్వర్లు, సరోజ, సునీత, నాగేశ్వరరావు, సోడా నాయక్, ఫిలిప్, కృష్ణ, మణిరత్నం పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంపీపీ కోటేరు లక్ష్మి సూచించారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల విజేతలకు శనివారం పెద్దాపురం సచివాలయంలో ఆమె నగదు బహుమతులను అందజేశారు. సర్పంచి నిప్పులపల్లి శాంతమ్మ, ఉపసర్పంచి బవిరిశెట్టి లక్ష్మి, సొసైటీ చైర్మన్ ఆవుల ప్రసాద్, సొసైటీ మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పేటలో వాలీబాల్ పోటీల విజేత జట్టుతో ఎంపీడీవో రమేష్‌బాబు తదితరులు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి

ఎమ్మెల్యే ఉదయభానుకు సత్కారం



విప్ సామినేని ఉదయభానును సత్కరిస్తున్న మాదాల వీరయ్యచౌదరి

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడుగా ఇటీవల నియమితులైన వేమవరం గ్రామానికి చెందిన మాదల వీరయ్యచౌదరి, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయభాను, వీరయ్యచౌదరిని అభినందించారు. సమర్ధవంతంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించారంటూ ఎమ్మెల్యే ఉదయభానుకు మాదాల వీరయ్యచౌదరి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఉదయభానును ఘనంగా సత్కరించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

నందిగామ: పట్టణంలోని రైతుపేటలోగల సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి నందిగామ ప్రాంత నిర్వాహకులు యు.వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమియో వైద్యులు బొందలపాటి నరసింహారావు, ఎముకుల వైద్యుడు శ్రీకాంత్ పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని వివరించారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు మరో అవకాశం

నందిగామ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాబురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత ఫీజుతోపాటు ఆలస్యరుసుం రూ.1000 చెల్లించి ఈనెల 22వతేదీ నుంచి 30వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి ఈఏడాది జూన్, జులై మాసాల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సెల్‌నంబరు 89776 45706లో సంప్రదించాలని బాబూరావు సూచించారు.

కెమికల్ కర్మాగారం వద్ద గ్రామస్తుల ఆందోళన

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామ సమీపంలోని కెమికల్ కర్మాగారం వద్ద శనివారం గ్రామస్తులు కొద్ది సేపు ఆందోళన చేశారు. కర్మాగారం కారణంగా సమీపంలోని తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగులను కర్మాగారంలోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట ఎస్ఐ ఆనంద్‌కుమార్ గ్రామస్తులతో మాట్లాడి వారిని అక్కడి నుంచి పంపించారు.

24న మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల : కంచికచర్ల మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఈనెల 24వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కానూరి శిల్ప తెలిపారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షత వహించనున్న ఈ సమావేశానికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

కొనసాగుతున్న కులగణన సర్వే



కొణకంచిలో సర్వే చేస్తున్న సిబ్బంది



గౌరవరంలో సర్వే చేస్తున్న వలంటీర్

పెనుగంచిప్రోలు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వే రెండోరోజు శనివారం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహించారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఈ సర్వేలో పాల్గొంటున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబసభ్యుల కుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రజలు ఈ సర్వేకు సహకరించాలని వారు కోరుతున్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట:మండలంలోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే చురుగ్గా సాగుతోంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు శనివారం ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లిత ఆయా కుటుంబసభ్యుల సభ్యుల వివరాలు అడిగి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

329 మద్యం సీసాలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

నందిగామ: అక్రమ మద్యం రవాణా, విక్రయాలు జరిపితే చర్యలు కఠినంగా ఉంటాయని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. మండలంలోని పెద్దవరం సమీపంలో తెలంగాణ నుంచి మద్యం తరలిస్తున్న ఒక వ్యక్తిని శనివారం నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 329 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనీష్ మాట్లాడుతూ నందిగామ పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యం రవాణా చేస్తూ,విక్రయిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై పండు దొర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.